
# ఫార్మాసిటీలోనే ఫార్మా విలేజ్?

- లగచర్ల, జహీరాబాద్‌లో వ్యతిరేకతతో సర్కారు వెనక్కి
- ముచ్చర్లలో అన్నీ సిద్ధంగా ఉండటంతో అక్కడే ఏర్పాటు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఫార్మా విలేజ్‌ల ప్రతిపాదనపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఫార్మా అనగానే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో పునరాలోచనలో పడింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతంలో సిద్ధం చేసిన ఫార్మాసిటీలోనే జనరల్ ఇంజినీరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని, అనంతరం అక్కడే ఫార్మా విలేజ్‌ను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు పారిశ్రామిక వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఫార్మాసిటీకి బదులుగా రాష్ట్రం నలువైపులా 10 ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ సర్కారు.. తొలుత వికారాబాద్, జహీరాబాద్ ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ జారీచేసిన విషయం విదితమే. కానీ, ఆ జిల్లాలోని లగచర్లలో ఫార్మా విలేజ్ భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో రావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. అక్కడ ఫార్మా విలేజ్ స్థానంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. జహీరాబాద్‌లో సైతం ఫార్మా విలేజ్ పట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో అక్కడ లగచర్ల రైతుల తిరుగుబాటు తరహా ఘటనలు తలెత్తకుండా చూసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. భూసేకరణ కోసం బలప్రయోగానికి దిగితే అక్కడ కూడా ప్రజలు తిరగబడే అవకాశం ఉన్నదని ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. దీంతో ప్రజావ్యతిరేకతను మరింత పెంచుకోవడం కంటే ఉన్న అవకాశాలను వినియోగించుకోవడమే ఉత్తమమని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

### తొలుత కాలుష్యం లేని పరిశ్రమలకు అనుమతి




ఫార్మాసిటీ స్థానంలో జనరల్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ ఇప్పటికే లేఅవుట్‌ను కూడా సిద్ధం చేసింది. అక్కడ ముందుగా ఫార్మా పరిశ్రమలను కాకుండా సాధారణ పరిశ్రమలతోపాటు కాలుష్యానికి ఆస్కారం లేని ఔషధ కంపెనీలను అనుమతించాలని నిశ్చయించినట్టు తెలిసింది. ఔషధ పరిశ్రమలో ఫార్ములేషన్లు, బల్క్‌డ్రగ్స్ తయారీ విభాగాలు ఎంతో కీలకమైనవి. ఇవి కాలుష్యాన్ని సృష్టించేవి కావడంతో తొలుత రసాయనాల శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, ఆ తర్వాతే ఔషధ పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. ఇలా చేస్తే రద్దయిన ఫార్మాసిటీ మళ్లీ మనుగడలోకి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు.

# గోల్డ్ ర్యాలీకి బ్రేక్?

## వచ్చే ఏడాది ధరల పెరుగుదల అంతంతే

**ట్రంప్ రాకతో వాణిజ్య యుద్ధాలు.. వృద్ధిరేటు, డిమాండ్ పతనం: డబ్ల్యూజీసీ**



న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఈ ఏడాది జోరుగా పెరిగిన బంగారం ధరలు.. వచ్చే ఏడాదిలో మాత్రం నెమ్మదించవచ్చని చెప్తున్నది ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ). మునుపెన్నడూ లేనివిధంగా దేశంలో పసిడి ధర ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఆల్‌టైమ్ హైకి చేరిన విషయం తెలిసిందే. తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు గరిష్ఠంగా రూ.82,400 పలికింది. అయితే అక్టోబర్ ఆఖరుదాకా పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. గత నెలన్నర (45 రోజులు)గా పడుతూ.. లేస్తూ.. సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూజీసీ తాజా అంచనాలు సైతం ప్రస్తుత మార్కెట్ తీరుకు అనుగుణంగానే ఉన్నాయి. కొత్త ఏడాదిలోనూ మార్కెట్ ట్రెండ్ ఇదే రీతిలో ఉండవచ్చన్న అభిప్రాయాన్ని 2025 ఔట్‌లుక్‌లో వ్యక్తం చేసింది.

**30 శాతానికిపైగానే..**

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు 30 శాతానికి పైగా పుంజుకున్నాయి. సెంట్రల్ బ్యాంకులు, ముఖ్యంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా బంగారం కొనుగోళ్లకు పెద్దపీట వేసింది. ఆర్బీఐ సైతం గోల్డ్ రిజర్వులకు అత్యంత ప్రాధాన్యాన్నిస్తున్న సంగతి విదితమే. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పోరు, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధానం వంటివి స్టాక్ మార్కెట్లను కుంగదీశాయి. ఫలితంగా మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం ప్రత్యామ్నాయ మార్గమైన పసిడి వైపు చూశారు. దీంతో ఈ ఏడాది గోల్డ్ మార్కెట్‌లో డిమాండ్ ఊహించనివిధంగా పెరిగిపోయింది. ఇది ధరలను పరుగులు పెట్టించింది. మరోవైపు పండుగ సీజన్లు, పెండ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి.

**ఇదీ సంగతి..**

బంగారం ధరలు వచ్చే ఏడాది ఈ స్థాయిలో పెరగకపోవచ్చని డబ్ల్యూజీసీ తాజాగా పేర్కొన్నది. జీడీపీ వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు గోల్డ్ మార్కెట్ క్రయవిక్రయాలను ప్రభావితం చేయవచ్చని అంటున్నది. జనవరిలో అమెరికాకు రాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు వాణిజ్య యుద్ధాలకు తెర లేపవచ్చన్న ఆందోళనల్ని కనబర్చింది మరి. పరస్పర సుంకాలతో మదుపరులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు దూరం కావచ్చని, దీంతో ఆయా దేశాల జీడీపీ, విపణిలో డిమాండ్ పడిపోవచ్చని హెచ్చరించడం గమనార్హం. కానీ ఇప్పటికైతే బంగారం ధరలు అంతర్జాతీయంగా గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. ఔన్స్ 2,700 డాలర్ల సమీపంలో ఉన్నది. ఇక గోల్డ్‌మన్ సాచ్స్ గ్రూప్ వచ్చే ఏడాది ఆఖర్లో 3,000 డాలర్లకు పోవచ్చంటున్నది. యూబీఎస్ ఏజీ అంచనా 2,900 డాలర్లుగా ఉన్నది.

### మరో రూ.1,000 డౌన్

బంగారం ధరలు శనివారం మరింత తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.980 దిగి రూ.77,890గా నమోదైంది. 22 క్యారెట్ రూ.900 పడిపోయి రూ.71,400 పలికింది. మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడమే కారణమని వ్యాపారులు చెప్తున్నారు. కాగా, శుక్రవారం కూడా ధరలు బాగా తగ్గిన విషయం తెలిసిందే. ఢిల్లీలో ఒక్క రోజే 24 క్యారెట్ తులం రూ.1,400 క్షీణించింది. ఇక వెండి కిలో ధర ఏకంగా రూ.4,200 పతనమై రూ.92,800 వద్దకు పరిమితమైంది. ఈ ఏడాది కిలో ధర లక్షా 2 వేల రూపాయల ఆల్‌టైమ్ హైని తాకినది తెలిసిందే.

# రైతులపై అడ్వాన్స్ బాదుడు!

- సెస్ పరిధిలో 16 నెలల మొత్తం ఒకేసారి చెల్లించాలని హుకుం
- 3 హెచ్‌పీని 5 హెచ్‌పీగా మార్చి వసూలు
- సెస్ తీరుపై రైతుల మండిపాటు



బిల్లు చూపుతున్న రైతు లాల లింగయ్య.

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 14: కేసీఆర్ ప్రభుత్వంలో పండుగలా సాగు చేసుకున్న రైతు.. కాంగ్రెస్ ఏడాది పాలనలో అరిగోస పడుతున్నడు. ఇప్పటికే 60 శాతానికి పైగా రైతులు రుణమాఫీ కాక, రైతుబంధు రాక ఆగమవుతుండగా, సర్కారు మరో భారం మోపుతున్నది. సెస్ పరిధిలో 'అడ్వాన్స్' పేరిట ఒకేసారి రుసుము చెల్లించాలని హుకుం జారీచేసింది. మరోవైపు త్రీ హెచ్‌పీని ఫైవ్ హెచ్‌పీగా మార్చి రూ. 2,800 వరకు వసూలు చేస్తున్నది. ఇలా అయితే ఎవుసం ఎలా చేయాలని రైతులు నిలదీస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో మొత్తం 157 శాంక్షన్ అయిన మోటర్లు ఉన్నాయి. ఇవి సెస్ పరిధిలో ఉన్నాయి. గతంలో ఆరు నెలలకు ఒక్కో మోటర్‌కు రూ.185 చొప్పున బిల్లు చెల్లించేవారు. కానీ, ప్రస్తుతం అధికారులు 'అడ్వాన్స్' పేరిట రైతులపై భారం మోపుతున్నారు. 2024 మే నుంచి 2025 మే వరకు 12 నెలలతోపాటు గతంలో వసూలు చేయని నాలుగు నెలలు కలిపి మొత్తం రూ.480 చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నారు. అవసరైతే మొదటి వాయిదా కింద రూ.300, రెండో వాయిదా రూ. 180 చెల్లించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే వసూలు కూడా ప్రారంభించారు. మరోవైపు త్రీ హెచ్‌పీ కనెక్షన్లను ఫైవ్ హెచ్‌పీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఒక్కో మోటర్‌కు రూ. 2,800 వరకు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అందులో కొన్ని మోటర్లు త్రీ హెచ్‌పీగా ఉన్నా ఫైవ్ హెచ్‌పీగా మార్చి బిల్లు వసూలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

### ఎవుసం జేసుడు ఎట్ల?

నాకు ఓ దగ్గర ఎకరంన్నర భూమి ఉంటే ఆడ బోర్ మోటర్ పెట్టిన. పదిహేనేండ్ల సంది అక్కడ పంటనే ఏత్తలేను. అయినా ఆరునెల్లకోసారి రూ.185 కడుతున్న. ఇప్పుడు దానిని ఫైవ్ హెచ్‌పీ కనెక్షన్ కింద మార్చి రూ.2,720 వసూలు చేసిన్రు. బాయిలకాడ మోటర్లకు వేలకు వేలు వసూలు సేత్తున్నరు.

-లాల లింగయ్య, రైతు (పోతిరెడ్డిపల్లి)

### మోటర్ మార్చకున్నా ఎక్కువ ఎందుకు కట్టాలె




నాకున్న ఎకురంన్నర భూమిని ఎన్నో ఏండ్ల సంది బీడువెట్టిన. అయినా అక్కడున్న త్రీ హెచ్‌పీ మోటర్‌కు 6నెలలకు ఓసారి రూ.185 కట్టెటోన్ని. ఇప్పుడు పంటలు ఏస్తున్న. అదే త్రీ హెచ్‌పీ మోటర్ వాడుతున్న. కానీ, ఇప్పుడు అడ్వాన్సుగా రూ.480 కట్టమంటున్రు. నేను త్రీ హెచ్‌పీ మోటర్ మార్చకున్నా ఫైవ్ హెచ్‌పీ కింద మార్చిన్రు. ఇంకో రూ.2700 కట్టాలని సెస్ ఆఫీసోళ్లు అంటున్నరు. ఇప్పటికే రైతుబంధురాక పెట్టిబడికి పైసల్లేక ఇబ్బంది పడుతున్నం. కరెంటు బిల్లులు ఇష్టమొచ్చినట్టు వసూలు చేస్తే వ్యవసాయం ఎట్ల జేస్తం?

-గన్నమనేని లక్ష్మణ్‌రావు, రైతు (పోతిరెడ్డిపల్లి)

# పెట్టుబడుల వరద

**డాటా సెంటర్లలోకి రెండేండ్లలో 100 బిలియన్ డాలర్లు: సీబీఆర్‌ఈ**



న్యూఢిల్లీ, డిసెంబర్ 14: పెట్టుబడులను ఆకర్షించడంలో డాటా సెంటర్లు దూసుకుపోతున్నాయి. 2027 నాటికి డాటా సెంటర్ల విభాగంలోకి 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నదని సీబీఆర్‌ఈ అంచనావేస్తున్నది. అలాగే డాటా సెంటర్ల కెపాసిటీ 2070 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. ప్రస్తుతం 1,255 మెగావాట్ల స్థాయిలో ఉన్న డాటా సెంటర్ల సామర్థ్యం..ఈ ఏడాది చివరినాటికి 1,600 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. గడిచిన ఆరేండ్లలో 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిన దేశీయ డాటా సెంటర్ల విభాగం..వచ్చే మూడేండ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని సీబీఆర్‌ఈ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం 19 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో డాటా సెంటర్లు నిర్వహిస్తుండగా, వచ్చే ఏడాది చివరినాటికి ఇది 31 మిలియన్ చదరపు అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది. అలాగే 475 మెగావాట్ల డాటా సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వచ్చే కొన్ని నెలల్లో ఇవి అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపింది. బీఎఫ్‌ఎస్‌ఐ, టెక్నాలజీ, టెలికం రంగాల నుంచి డాటా సెంటర్లకు డిమాండ్ ఉంటుందని తెలిపింది.

**అంతర్జాతీయ సంస్థలు కూడా..**

దేశీయ డాటా సెంటర్లలోకి అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వీటితోపాటు రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు కూడా భారీగా నిధులుచొప్పించడానికి సిద్ధమవుతున్నాయి. డాటా సెంటర్ల నిర్వహణలో ముంబై తొలిస్థానం నిలిచింది. ఆ తర్వాతి క్రమంలో చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులు ఉన్నాయి.

# రాష్ట్రంలో 400 జీసీసీల ఏర్పాటే లక్ష్యం

## రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): రానున్న రోజుల్లో రాష్ట్రంలో 400 గ్లోబల్ కెపబులిటీ సెంటర్లు(జీసీసీ) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 220కి పైగా జీసీసీలు ఉండగా, సమీప భవిష్యత్తులో వీటిని రెండింతలు పెంచడం ద్వారా బెంగళూరును అధిగమించాలని సంకల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. 'టెక్‌వేవ్' హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన అత్యాధునిక జీడీసీను శనివారం శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిజిటల్ రంగంలో సాధికారిత సాధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది ఎంతో దోహదపడుతున్నదన్న ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందుకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు, ఇందులో టెక్‌వేవ్ ఏర్పాటు చేసిన జీడీసీ కీలకపాత్ర పోషించనున్నదన్నారు. టెక్‌వేవ్‌కు హైదరాబాద్ కార్యాలయంలో ప్రస్తుతం 2,400 మంది ఉద్యోగులు, అలాగే ఖమ్మంలో మరో 500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తాజాగా లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో మరో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని టెక్‌వేవ్ సహ వ్యవస్థాపకులు, చైర్మన్ జీ దామోదర్ రావు తెలిపారు.

# భూషణ్ స్టీల్‌కు భారీ ఊరట

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన భూషణ్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు భారీ ఊరట లభించింది. సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఈడీ జప్తు చేసిన రూ.4,025 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించింది. కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రకారం దివాలా-ఐబీసీ కింద దివాల తీసిన కంపెనీ ఆస్తులను జేఎస్‌డబ్ల్యూ సరైన పరిష్కారం చూపించడంతో ఈడీ ఈ నిర్ణయం తీసుకున్నది. భూషణ్ స్టీల్‌కు చెందిన ఈ ఆస్తులను పీఎంఎల్‌ఏ చట్ట ప్రకారం గతంలో ఈడీ జప్తు చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ సూచనల మేరకు ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసింది.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తులు

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

వరంగల్ లీగల్, డిసెంబర్ 14 : దేశ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ముందుకొస్తున్న కక్షిదారులకు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు గీతాంబ, అపర్ణాదేవి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, కలెక్టర్లతో కలిసి లోక్ అదాలత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ప్రధాన జడ్జి మాట్లాడుతూ.. కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు హాజరై కేసులు పరిష్కరించుకోవాలన్నారు. హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి అపర్ణాదేవి మాట్లాడుతూ.. స్నేహపూరిత వాతావరణంలో ఇరుపక్షాలు ఆమోదయోగ్యమైన తీర్పు ద్వారా పరిష్కారం పొంది రాజీపడాలని సూచించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. రాజీపడే కేసుల విషయంలో కక్షిదారులు కోర్టు చుట్టూ తిరగకుండా జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను ఉపసంహరించుకోవాలని తెలిపారు. వరంగల్ జిల్లాలో 8, హనుమకొండ జిల్లాలో 8 బెంచీలను ఏర్పాటు చేశామని తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో 700మంది కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు ప్రేమలత, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్‌రావు, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తీగల జీవన్‌గౌడ్, వరంగల్ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సురేశ్, హనుమకొండ జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# నెక్కొండ మున్సిపాలిటీకి అడుగులు

- ఐదు గ్రామాల విలీనానికి చర్యలు
- 16న గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సభలు

నెక్కొండ, డిసెంబర్ 14: నెక్కొండ పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చేందుకు అడుగులు పడుతున్నాయి. చుట్టుపక్కల ఐదు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. నెక్కొండ పట్టణ జనాభా 2011 లెక్కల ప్రకారంగా 6,779 (8.86 చ.కిమీ), రెండు కిలో మీటర్ల దూరంలోని గుండ్రపల్లి జనాభా 1647 (4.67చ కి.మీ), మూడు కి.మీ. దూరంలో ఉన్న టేకులకుంటతండా జనాభా 870 (1.60 చ.కి.మీ), నాలుగు కిలో మీటర్ల దూరంలోని పత్తిపాక జనాభా 923 (4.91 చ.కి.మీ), రెండు కిలో మీటర్ల దూరంలోని అమీన్‌పేట జనాభా 664 (2.50చ.కి.మీ), మూడు కిలో మీటర్ల దూరంలోని నెక్కొండ తండా జనాభా 485 (0.090 చ.కి.మీ)తో కలుపుకొని నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చేందుకు రంగం సిద్ధమైంది. 2011 జనాభా లెక్కల ప్రకారంగా 11,368 జనాభా (22.63 చ.కి.మీ)తో నెక్కొండను మున్సిపాలిటీగా అప్‌గ్రేట్ చేసేందుకు కసరత్తు సాగుతున్నది. ఈ మేరకు 16న సంబంధిత గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించాలని కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు.

# మాటేడులో గుప్త నిధుల కోసం తవ్వకాలు

తొర్రూరు, డిసెంబర్ 14 : గుప్త నిధుల కోసం మండలంలోని మాటేడులో కాకతీయుల కాలం నాటి రామలింగేశ్వర స్వామి ఆలయంలో తవ్వకాలు చేపట్టిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం ముఖద్వారంలో ఉన్న నంది విగ్రహం వెనుక భాగంలో గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టి, సొరంగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయంలో జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, తవ్వకాలు చేపట్టిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.



నంది విగ్రహం వెనుక తవ్విన గుంత

# ఐదు గుంటల భూమి కోసం హత్య

- అన్నను నరికి చంపిన తమ్ముడు, మరదలు
- పట్టపగలే కళ్లల్లో కారం చల్లి.. గొడ్డలితో దాడి
- తృటిలో తప్పించుకున్న మృతుడి కుమారుడు
- భూపాలపల్లి జిల్లా దేవరాంపల్లిలో దారుణ ఘటన



డాగ్‌స్క్వాడ్‌తో గాలింపు చర్యలు చేపడుతున్న సీఐ, ఎస్సై



సారయ్య(ఫైల్)

కాటారం, డిసెంబర్ 14 : ఐదుగుంటల భూమి కోసం తోడబుట్టిన అన్ననే తమ్ముడు, మరో సోదరుడి భార్య, కుటుంబ సభ్యులు కలిసి అతి దారుణంగా హత్య చేశారు. ఫ్యాక్షన్ సినిమాను తలదన్నేలా బైక్‌పై వెళ్తుండగా మాటు వేసి మరీ కళ్లల్లో కారం చల్లి గొడ్డలితో నరికి చంపారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లిలో శనివారం పట్టపగలే చోటుచేసుకుంది. తలకు టోపీ పెట్టుకున్న మృతుడి కుమారుడు కళ్లల్లో కారం పడక పోవడంతో బైక్‌పై నుంచి దూకి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంకరాంపల్లి జీపీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన మారపాక సారయ్య (50)కు తమ్ముడు సమ్మయ్య, మరో తమ్ముడి భార్య లక్ష్మి కుటుంబాలతో ఐదు గుంటల భూమికి సంబంధించిన వివాదం ఉంది. కొంతకాలంగా సారయ్య భార్య అంకమ్మ, ఇద్దరు కుమారులతో కలిసి భూపాలపల్లి బాంబులగడ్డ వద్ద ఉంటున్నది. భూమి విషయమై 8 నెలల క్రితం పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టగా సారయ్యకు ఐదు గుంటల భూమి ఇవ్వాలని చెప్పారు. ఇటీవల తన కూతురు వివాహ సమయంలో భూమిని తనకివ్వకుంటే అమ్మడానికి ఒప్పుకోనని సారయ్య పేచీ పెట్టడంతో పెళ్లి అయిన తర్వాత ఇస్తానని పెద్ద మనుషుల సమక్షంలో లక్ష్మి ఒప్పుకుంది. శుక్రవారం దేవరాంపల్లికి వచ్చిన సారయ్య భూమి విషయమై సమ్మయ్య, లక్ష్మిని అడగగా వారు ఇవ్వమని తెగేసి చెప్పారు. దీంతో రేపు పెద్ద మనుషులతో పంచాయతీ పెట్టిస్తానని భూపాలపల్లికి వెళ్లి శనివారం కుటుంబసభ్యులతో దేవరాంపల్లికి వచ్చాడు. సారయ్య పెద్ద కుమారుడు శ్రీరాంతో కలిసి కుల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా తాము భూమి ఇవ్వమని సమ్మయ్య, లక్ష్మి వాదించారు. ఈ విషయాన్ని సారయ్య తన భార్య అంకమ్మ, చిన్న కొడుకు అంజికి తెలిపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని చెప్పాడు. సారయ్య, శ్రీరాం బైక్‌పై దేవరాంపల్లి బస్టాప్‌కు వెళ్లి వస్తున్న క్రమంలో శంకరాంపల్లి సమీపంలో సమ్మయ్య, లక్ష్మి, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు కళ్లల్లో కారం చల్లి, గొడ్డలితో నరికి, సుత్తి, రాడ్లతో తలపై కొట్టడంతో సారయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీరాం బైక్‌పై నుంచి దూకి తృటిలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ, ఎస్సైలు ఘటనా స్థలాన్ని సందర్శించి డాగ్ స్క్వాడ్‌తో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా నిందితులు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.



మహబూబాబాద్ పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

# వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- మహబూబాబాద్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహం పరిశీలన

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 14 : రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో మెరుగైన వసతులను కల్పించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. శనివారం ఆయన మహబూబాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఏర్పాటు చేసిన కామన్ డైట్, కాస్మొటిక్స్ మెనూ చార్ట్‌ను ప్రారంభించారు. పాఠశాల దశలోనే విద్యార్థులు మంచి మార్గాన్ని ఎంచుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. చదువుతోనే సమాజంలో విలువ పెరుగుతుందని సూచించారు. అనంతరం వంటశాల, తాగునీరు, బాలికల వసతి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే ఇందిరానగర్ కాలనీని ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల రెసిడెన్షియల్ హాస్టల్‌ను సందర్శించారు. మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించారు.





సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శనివారం 5వ రోజుకు చేరింది. జనగామలో కలెక్టరేట్ ఎదుట కుటుంబసభ్యులతో కలిసి నిరసన తెలుపగా ఓ చిన్నారి 'సీఎం గారు స్పందించండి' అంటూ ప్లకార్డు ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది.

– జనగామ చౌరస్తా, డిసెంబర్ 14

# పులి జాడ కోసం అన్వేషణ

మంగపేట, డిసెంబర్ 14 : పెద్దపులి జాడ కోసం అటవీశాఖ అధికారులు అన్వేషణ కొనసాగిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం తిమ్మాపురం సమీప చౌడు ఒర్రె వద్ద అటవీ అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. శుక్రవారం బొమ్మాయిగూడెం అటవీ ప్రాంతంలో చీపురు పుల్లల సేకరణకు వెళ్లిన జబ్బ పొట్టయ్యకు గండిఒర్రె వద్ద పెద్దపులి కనిపించిందని, అది ఎక్కడ దాడి చేస్తుందోనని పరుగున గ్రామానికి వచ్చి అటవీ అధికారులకు తెలిపాడు. మూడేళ్ల క్రితం ఇదే అడవిలో ఆవుదూడపై పులి దాడి చేసి చంపిందని పలువురు గ్రామస్తులు అటవీ సిబ్బందితో వాపోయారు. మళ్లీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. దీంతో శనివారం ఇన్‌చార్జి రేంజ్ అధికారి అశోక్ ఆధ్వర్యంలో అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఒర్రెలు, తోగులు, వాగులు, మల్లూరు వాగు ప్రాజెక్టు పరిసరాల్లో పరిశీలించారు. సాయంత్రం వరకు కూడా పులి జాడ దొరకలేదని, పక్క జిల్లాల అటవీ ప్రాంతాలకు వెళ్లి ఉండొచ్చని ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో అశోక్ తెలిపారు.



మల్లూరు వాగు ప్రాజెక్టు సమీప ఒర్రె ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారుల బృందం

# జూపార్కుకు తెల్లపులులు, సింహం

హనుమకొండ, డిసెంబర్ 14 : హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూపార్కుకు రెండు తెల్లపులులు, ఒక సింహం రానున్నదని అటవీ శాఖ అధికారులు తెలిపారు. జూపార్కుకు రెండు తెల్ల పులులు, ఒక సింహాన్ని తీసుకొచ్చేందుకు సెంట్రల్ జూ అథారిటీని సంప్రదించాలని శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 13వ గవర్నింగ్ బాడీ సమావేశంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌ను ఆదేశించారు. పది రోజుల క్రితమే జూపార్కుకు శంకర్, కరీనా అనే పులులు వచ్చాయి. జూపార్కులో జంతువులను తీసుకురావడం వల్ల సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# వాజేడు ఎస్సై ఆత్మహత్యకు కారకురాలైన యువతి అరెస్ట్

వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 14 : వాజేడు ఎస్సై ఆత్మహత్యకు కారణమైన యువతిని అరెస్ట్ చేసినట్లు వెంకటాపురం (నూగూరు) సీఐ బండారి కుమార్ శనివారం తెలిపారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దుదియ తండాకు చెందిన బానోత్ అనసూర్య అలియాస్ అనూష ఏడు నెలల క్రితం రాంగ్ నంబర్ కాలింగ్ ద్వారా ఎస్సైకి పరిచయమైంది. అతడిని పెళ్లి చేసుకుంటే జీవితం బాగుంటుందని భావించి సాన్నిహిత్యం పెంచుకుంది. ఈక్రమంలో అతడిని ఒత్తిడి చేయగా నిరాకరించడంతో మీడియాతో పాటు ఉన్నతాధికారులకు ఎస్సై ఫిర్యాదు చేస్తానని బ్లాక్‌మెయిల్ చేసింది. తీవ్ర ఒత్తిడికి లోనైన ఎస్సై వాజేడులోని మండపాక శివారులో ఉన్న ఫెరియాడో రిసార్ట్‌లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో సదరు యువతి ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు సేకరించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ పేర్కొన్నారు.



నిందితురాలి అరెస్టును చూపి వివరాలు వెల్లడిస్తున్న వెంకటాపురం (నూగూరు) సీఐ బండారి కుమార్

# ఆగంతకుడి వీరంగం

- టికెట్ బంచ్ ఎత్తుకొని పరుగులు
- పట్టుకొని కట్టేసిన ప్రయాణికులు
- నెక్కొండ రైల్వేస్టేషన్‌లో ఘటన



ఆగంతకుడిని అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై మహేందర్

నెక్కొండ, డిసెంబర్ 14 : ఆగంతకుడు టికెట్ బంచ్‌ను తీసుకొని పరుగెత్తిన ఘటన శనివారం నెక్కొండ రైల్వేస్టేషన్‌లో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మధ్యాహ్నం సమయంలో టికెట్ కౌంటర్ వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఒక్కసారిగా టికెట్ బంచ్‌ను తీసుకొని పరుగులు పెట్టాడు. వెంటనే ప్రయాణికులు అతడిని వెంబడించి పట్టుకొనే యత్నం చేయగా, రాళ్లు రువ్వి భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో సాహసం చేసిన కొందరు ఆగంతకుడిని పట్టుకొని ఫుట్ ఓవర్ బ్రిడ్జికి కట్టేసి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మత్తులో ఉన్న అతడు ఎలాంటి వివరాలు చెప్పకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.